# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 64 | శుక్రవారం | 01 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




8లో..

## కాంగ్రెస్‌దే అధికారం

బీజేపీ, బీఆర్ఎస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదాం..

తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలి

కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వి

పరకాల నుంచి పోటీకి సై

నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమే లక్ష్యం

బీసీ సామాజిక వర్గంపైనే ఆశలు

గెలుపే లక్ష్యంగా వ్యూహాలు






# కాళీతో 'చల్లా'రేనా..?

## కమల దళంలో కాళీప్రసాద్



వివరాలు 2లో..

బడుగు, బలహీన వర్గాల ఆత్మబంధువు..సేవాతత్పరుడు.. పరకాల కీర్తి కిరీటం.. నగరంలోని గార్డియన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఆయన కమల దళంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చారు. 2023 ఆగస్టు 27న కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా కాళీప్రసాద్ రావు కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో ఆయనకు బీజేపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాళీప్రసాద్ వైద్య వృత్తిలో కొనసాగడం.. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో పరకాల నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమవుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో

## రోడ్డును కమ్మేసిన పొగ

గడపగడపకి

## సంక్షేమ పథకాలు

గడప ముందు అభివృద్ధి కార్యక్రమాలు

ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్





8లో..



8లో

కనకదుర్గ ఆలయంలో

## కుంకుమపూజ



# కాళీతో 'చల్లా'రేనా..?

## కమల దళంలో కాళీప్రసాద్

పరకాల నుంచి పోటీకి సై

నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమే లక్ష్యం

బీసీ సామాజిక వర్గంపైనే ఆశలు

గెలుపే లక్ష్యంగా వ్యూహాలు





**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఈ సారి అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి. గెలుపే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పావులు కదుపుతోంది. అందుకోసం గెలుపు గుర్రాలను బరిలో దించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. మెజారిటీ స్థానాల్లో పాగా వేయాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. ఇందులో భాగంగా ముందుగా బీజేపీ నేతలు పరకాల నియోజకవర్గంపై గురిపెట్టారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయనను ఓడించడమే లక్ష్యంగా కమలం నేతలు ప్రముఖ డాక్టర్ కాళీప్రసాద్ రావును బరిలో దించుతున్నారు. అయితే, పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు 'కాళీ' ఆసక్తిగా ఉన్నారు. టిక్కెట్ విషయంలో స్పష్టమైన హామీ లభించడంతో ఆయన బీజేపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేశారు. ఈ మేరకు ఇప్పటికే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. 2023 ఆగస్టు 27న ఖమ్మంలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో కాళీప్రసాద్ కాషాయ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు వివిధ పార్టీల్లోని ముఖ్యనేతలు, వందలాది మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు.





### ఏ బాధ్యతనిచ్చినా స్వీకరిస్తా..

**– డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు**

దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో బీజేపీలో చేరాను. విలువలతో కూడిన రాజకీయాలు, జవాబుదారీతనంతో పనిచేస్తాను. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన పట్ల ప్రజలు పూర్తిగా విసిగిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్, రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్, శాసనసభ్యుడు ఈటల రాజేందర్ నాయకత్వంలో తెలంగాణలో కాషాయ జెండా తప్పక ఎగురుతుంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ గెలుపు తథ్యం. రాబోయే రోజుల్లో పార్టీ అప్పగించే బాధ్యతలను మనస్ఫూర్తిగా నిర్వర్తిస్తా.







### 'చల్లా' టార్గెట్‌గా..



డాక్టర్ కాళీప్రసాద్ రావు బడుగుల బిడ్డ. ఎముకలు, కీళ్ల ప్రత్యేక వైద్యనిపుణుడు. సుదీర్ఘ కాలంగా వైద్యవృత్తిలో కొనసాగుతున్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడి (ఎలెక్ట్)గా పనిచేస్తున్నారు. ఆయనకు ప్రముఖ ఆర్థో వైద్యుడిగా, గార్డియన్ ఆసుపత్రి అధినేతగా పేరు ఉంది. ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న ఆయన బీజేపీ నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. అయితే, పరకాల నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం అధికంగా ఉంది. ఈ నియోజకవర్గంలో సింహభాగం మున్నురుకాపు సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఉన్నాయి. కాళీప్రసాద్ కూడా ఇదే సామాజికవర్గం కావడం కలిసి వచ్చే అంశం. ఆయనను బరిలో నిలిపితే స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని సునాయాసంగా ఓడించొచ్చని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది.

### వివిధ వర్గాలతో సత్సంబంధాలు..

డాక్టర్ కాళీప్రసాద్ రావుకు పరకాల నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో 2,07,800 మంది పైచిలుకు ఓటర్లు ఉన్నారు. బీసీ ఓటర్లు సుమారు 60శాతం వరకు ఉంటారు. ముదిరాజు సామాజిక వర్గానికి సుమారు 31వేల ఓట్లు, మున్నూరు కాపులకు 32వేలు, గౌడ సామాజిక వర్గానికి 25 వేలు, యాదవులకు 22వేలు, పద్మశాలీలకు 15వేలకు పైగా ఓట్లు ఉన్నాయి. ఈటల రాజేందర్ ముదిరాజ్ కావడం.. ఆయన ప్రోత్సాహంతోనే కాళీప్రసాద్ పరకాల నుంచి బరిలోకి దిగుతుండడంతో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లలో మెజారిటీ ఓటర్ల మద్దతు ఆయనకు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాళీప్రసాద్ మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందినవాడు. ఆ సామాజిక వర్గం నుంచి కూడా సంపూర్ణ మద్దతు లభిస్తుందనే భావన ఉంది. దీనికితోడు చల్లా ధర్మారెడ్డిపై ఎస్సీలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, కాళీప్రసాద్ కు ఇది కలిసి వచ్చే అంశమని బీజేపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ ఓటర్లు తనకు మద్దతు ఇస్తారని కాళీప్రసాద్ ఆత్మవిశ్వాసంతో ఉన్నారు.

### రాజకీయాల్లో కీలక పరిణామం..

హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో కమలాపూర్ మండల ఇన్చార్జిగా పనిచేసిన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై ఈటల రాజేందర్ నిప్పులు చెరిగారు. చల్లా ధర్మారెడ్డిని ఓడించడమే లక్ష్యమని ఈ సందర్భంలో వ్యాఖ్యానించారు. ఉప ఎన్నిక అనంతరం పరకాలలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఈటల రాజేందర్ ఎమ్మెల్యే చల్లాపై నిప్పులు చెరిగారు. ఈ నేపథ్యంలోనే పరకాల ఎమ్మెల్యేపై పక్కా స్కెచ్ వేశారనే ఆసక్తికర చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంపై ఈటల రాజేందర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అందుకే చల్లాను ఢీకొనే సత్తా ఉన్న కాళీప్రసాద్ ను బరిలోకి దింపుతున్నట్లు సమాచారం. పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి సహాయ సహకారం కూడా కాళీకి ఉండడం కలిసి వచ్చే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. గార్డియన్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కాళీప్రసాద్ రావు గతేడాదిగా పరకాల నియోజకవర్గంలో విస్తృతంగా గ్రౌండ్ వర్క్ చేశారు. ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతున్నారు.. స్థానిక ఎమ్మెల్యే బలబలాలు..తదితర అనేక అంశాలపై ఆయన అధ్యయనం చేశారు. పరకాలలో కాషాయ జెండా ఎగిరేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. స్టెతస్కోప్ పట్టి ప్రజల నాడి చూసిన కాళీప్రసాద్ అసెంబ్లీలో 'అధ్యక్షా'అని పిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

## మల్హర్ నూతన ఏవోగా సుధాకర్

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలం నూతన ఏవోగా సుధాకర్ నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ ఏవోగా పని చేసిన ముంజ మహేష్ మహాదేవ పూర్ మండలానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ నుంచి బదిలీపై వచ్చిన సుధాకర్ మల్హర్ ఏవోగా బాధ్యతలు చేపట్టారు.

## పాఠశాల ఆవరణలో పందుల సంచారం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం పెద్దతూండ్ల గ్రామ ప్రాథమిక పాఠశాల అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న ఈ తరుణంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్ళాలంటే వెనకడుగు వేస్తున్నారు. ఉపాధ్యాయులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో పాఠశాల ఆవరణలో ఉన్న ఇంకుడు గుంతలో నీళ్లు చేరి మురుగు గుంతను తలపిస్తుంది. దీనికి తోడు పందులు కూడా పాఠశాల ఆవరణలో సంచరిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సీపీఎస్ రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ పోరాటాల కమిటీ సంఘం అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ లోని ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దంతాలపల్లి మండలం నుంచి ఉపాధ్యాయులు భారీగా బయలుదేరారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో దంతాలపల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాలలో పనిచేస్తున్న ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ సెకండరీ ఉపాధ్యాయులు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎండీ యాకూబ్, జిల్లా కోశాధికారి కొండ నాగమల్లయ్యతో పాటు భిక్షపతి, స్వప్న, దంతాలపల్లి మండలం అధ్యక్షుడు కొండ యాకయ్య, రాపోలు విజయ్, కుమార్, అందే చిరంజీవి, నరసింహుల పేట, ఉడుగుల వెంకటేశ్వర్లు, మేకలకుమర్, బి.హరి నాయక్, ప్రవీణ్, బాబు, లక్ష్మణ్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

## సిద్ధార్థలో ఘనంగా డ్రైవర్స్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్‌లో శుక్రవారం డ్రైవర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రైవర్లు కేక్ కట్ చేసి సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పాశం మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపలన్నారు. వాహనాలను అతివేగంగా నడిపి ప్రాణాల మీదకు తీసుకురావొద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు కనుగుల వేణు, లక్కరాజు టేకుల స్వామి, మంచాల రఘు, బాదావత్ రమేష్, అన్నపోయిన అనిల్ కుమార్, అజ్మీరా ప్రశాంత్, ముప్పటి స్వామి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను కాపాడేందుకు మరో ఉద్యమం

### బీజేపీ నేత కాళీ ప్రసాద్



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ ప్రజలు మోసం చేయడంలో సిద్ధహస్తుడు సీఎం కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. నడికూడ మండలంలోని రాయపర్తి, పులిగిల్ల గ్రామాలలో నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాలు, బీజేపీ నాయకులను బీజేపీ నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్ కలిశారు. గ్రామాలలో కాళీ ప్రసాద్ తో పాటు బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి పార్టీ చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలను కలిసి ముందుకు సాగారు. రాయపర్తి, పులిగిల్ల గ్రామాల ప్రజలు కలిసిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరకాల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు మొలుగూరి భిక్షపతి పాల్గొని మాట్లాడుతూ ఆట మొదలైందని, తెలంగాణ ప్రజలను వంచన చేయడంలో కేసీఆర్ లాంటి నాయకుడు భారతదేశంలో లేడన్నారు. తెలంగాణ ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని బీజేపీ నాయకుడు కాళీ ప్రసాద్ అన్నారు. ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తున్నారని, క్రమశిక్షణకు మారుపేరైన బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలందరికీ అభిమానం ఉందన్నారు. తెలంగాణ ప్రజలందరూ తెలంగాణ సాధించేందుకు ఉద్యమం చేసుకుంటే ఆ ఉద్యమ ఫలితం మాత్రం కేసిఆర్ కుటుంబం అనుభవిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలందరూ మరోమారు ఉద్యమం చేసి కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఉద్యమకారులను పక్కనపెట్టి, ఉద్యమ ద్రోహులకు పట్టం కట్టాడని అన్నారు. రాష్ట్రంలో ఏదైనా సంక్షేమ పథకం కావాలంటే ఇక్కడ భూములు, లిక్కర్ అమ్మి సంక్షేమ పథకాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు గోనెల కోటేశ్వర్, దండు సురేష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల దివాకర్, మండల కోశాధికారి శక్తి కేంద్రం ఇంచార్జి మూల తిరుపతిరెడ్డి, పులిగిల్ల శక్తి కేంద్రం ఇంచార్జి జాల ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, సాంబరెడ్డి, మల్లారెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సుధీర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ సల్పాల సురేష్, భూత అధ్యక్షులు అల్లం వజ్రం, మహేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా బొగ్గుల వాగు ప్రాజెక్ట్ కాలువలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి అటవీ ప్రాంతంలో గల మధ్య తరహా బొగ్గుల వాగు ప్రాజెక్ట్ కాలువల దుస్థితి అధ్వానంగా తయారైంది. దీంతో ప్రాజెక్ట్ నిండా నీరు ఉన్న చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. గత జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు బొగ్గుల వాగు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో సాగుకు ఇబ్బంది లేదనుకున్న రైతుల ఆశలు అడియాశలు అయ్యేలా ఉన్నాయి. ప్రాజెక్ట్ కింద సుమారు 6000ఎకరాలు సాగవుతుండగా వీటికి ప్రధాన కాలువతో పాటు డి1, డి 2, డి3 అనే మూడు అనుబంధ కాలువల ద్వారా నీటి సాగు జరుగుతుంది. 2012 సంవత్సరంలో సుమారు రూ.8కోట్ల నిధులతో కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టారు. తరువాత గత 10 సంవత్సరాలుగా కాలువలకు ఎటువంటి మరమ్మత్తులు చేపట్టకపోవడంతో కాలువలు కొన్ని చోట్ల కూలి పోయి మరి కొన్ని చోట్ల పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. కాలువలకు అమర్చిన తూము గేట్లు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రాజెక్ట్ నిండా నీరు ఉన్న వ్యవసాయ అవసరాలకు పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్ట్ నెలలో లోటు వర్షపాతం నమోదు కావడంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు కాలువలను శుభ్రం చేసి నీరు పారించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొగ్గుల వాగు ప్రాజెక్ట్ కాలువల మరమ్మత్తు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

### పీపీపీ పద్ధతిలో చార్జింగ్ స్టేషన్లు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల కోసం పీపీపీ పద్ధతిలో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకుదరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఎస్ రెడ్కో వరంగల్ జిల్లా మేనేజర్ జి.మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 37అనువైన స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. అవి తొర్రూర్ 4, దంతాలపల్లి 1, నర్సింహులపేట 1, మరిపెడ 4, కురవి 3, మహబూబాబాద్ 7, గూడూరు3, పెద్ద వంగర 2, బయ్యారం 1, డోర్నకల్ 4, నెల్లికుదురు 2, కేసముద్రం2, ఇనుగుర్తి 1, గార్ల 2 మొత్తం 37 ఛార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. టీఎస్ రెడ్కో ఎంపిక చేయబడ్డ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లకు 10సంవత్సరాల వరకు రెవెన్యూ షేరింగ్ ఆధారితంగా ఈ స్థలాన్నికేటాయిస్తారన్నారు. ఆయా స్థలంలో ఎంపిక చేయబడ్డ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు గైడ్ లైన్స్' ప్రకారంగా చార్జింగ్ స్టేషన్ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకొని పదేళ్లపాటు వాటిని నిర్వహించవలసి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు టీఎస్ రెడ్కో వెబ్ సైట్ www.tsredco.telangana.gov.in గాని లేదా టీఎస్ రెడ్కో హెడ్ ఆఫీస్లు గాని సంప్రదించి ఈఓఐ లో పాల్గొనాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 4 వరకు ప్రత్యక్షంగా తీసుకొని టీఎస్ రెడ్కో హెడ్ ఆఫీస్, హైదరాబాద్ వచ్చి అలాట్మెంట్ ప్రక్రియలో పాల్గొనాలని తెలిపారు.

# ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా

### ఎస్పీ చంద్ర మోహన్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా పరిధిలో షీ టీమ్ బృందాలు అధికారుల పర్యవేక్షణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా పని చేస్తున్నాయని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ చంద్ర మోహన్ తెలిపారు. కళాశాలలు, పాఠశాలల్లో చదివే విద్యార్థినులు, మహిళలకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్ లు ఆకతాయిలు ఆగడాలకు అడ్డుకట్టు వేస్తునాయని ఆయన అన్నారు. రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, విద్యాసంస్థలు, దేవాలయాల పరిసర ప్రాంతాల్లో షీ టీమ్ పోలీసులు మఫ్టీలో ఉంటూ ఆకతాయిలకు చెక్ పెడుతున్నారని పేర్కొన్నారు. మహబూబాబాద్, తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలలో షీ టీం పోలీసులు ఆ శాఖ పనితీరుపై బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, ముఖ్య కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో పోటీపడి పనిచేస్తున్నారని, తాము పనిచేస్తున్న రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారని, అలాంటి వారికి షి టీమ్స్ ఎల్లపుడు అండగా నిలుస్తూ దైర్యాన్ని ఇస్తాయన్నారు. అవగాహన కార్యక్ర మాలు పెంచడం ద్వారా మారుమూల



గ్రామీణ ప్రాంత మహిళలు, విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ధైర్యంగా ముందుకు వస్తారని, షీ–టీమ్ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. తమకు వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తూ ఆకతాయిల ఆగడాలను వీడియో రికార్డ్ చేయడంతో పాటు కొన్ని సందర్భాల్లో కేసులు సైతం నమోదు చేస్తున్నారన్నారు. ఆకతాయిలు వెంటపడి వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100, 112తో పాటు 79011 42009,87126 56935 వాట్సప్ నంబర్ లో సంప్రదించాలని , ఉన్నచోట నుంచి ఫిర్యాదు చేయడానికి qr.tspolice.gov.in% వెబ్ సైట్ లోకి లాగిన్ అవ్వడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బస్టాండ్, పాఠశాలలు. కళాశాలలు వద్ద మహిళ లను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# కేసీఆర్ ఎన్నికల జూదంలో ఉద్యోగాల నోటిఫికేషన్లు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఖాళీగా ఉన్న మొత్తం టీచర్ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం విప్లవ ప్రజా సంఘాల నాయకులు వరంగల్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ వాత్సవకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల కోసం దాదాపు 5లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని కానీ కేసీఆర్ ప్రభుత్వం 13000 పోస్టులు మాత్రమే ఉన్నాయని, అందులో సర్దుబాటు చేయగా 9000పోస్టులు మిగిలాయని అసెంబ్లీలో ప్రకటించారు. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో చాలామంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన విషయం ప్రభుత్వానికి తెలిసినప్పటికీ కొన్ని పోస్టులు మాత్రమే ఉన్నాయని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో నిప్పుల మీద నీళ్లుచల్లినట్లుగా 5వేల ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా ప్రకటించి చేతులు దులుపుకున్నదని వారు ఆరోపించారు. తమ స్వార్థ అధికార రాజకీయాల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అనేక ఉద్యోగాలకు ఒకవైపు నోటిఫికేషన్ ఇవ్వడం, పరీక్షలు నిర్వహించడం, పేపర్ లీక్ చేయడం చూస్తుంటే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న మొత్తం పోస్టులను ప్రకటించి డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోవు ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి తగిన శాస్తి తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్ )రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు, పీడీఎస్ యూ జిల్లా నాయకులు బాషీపాక అశోక్, జిల్లా నాయకులు, కానుగుల రంజిత్ కుమార్, రఘుసాల సుమన్ లు ఉన్నారు.

# పందిళ్ల స్మారక నాటకోత్సవాలను జయప్రదం చేయాలి

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పందిళ్ల శేఖర్ బాబు స్మారక నాటకోత్సవాలను దిగ్విజయం చేయాలని ప్రభుత్వ చీఫ్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. నగర ప్రజలు, కళాభిమానులు కళాపోషకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కళాకారులను ఆశీర్వదించాలన్నారు. శుక్రవారం పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో రేపటి నుంచి జరగబోవు జాతీయ నాటకోత్సవాల ఏర్పాట్లను కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించి సూచనలు సలహాలు చేశారు. ఈ నాటక ఉత్సవాలకు తన పూర్తి సహాయ, సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఆకుల సదానందం, నిర్వాహక కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, వోడపల్లి చక్రపాణి గూడూరు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. శనివారం జరగబోవు ప్రదర్శన రాత్రి 7గంటలకు శ్రీ సాయి ఆర్ట్స్ కొంకలూరు వారి గమ్యస్థానాల వైపు (నాటిక), రాత్రి 8గంటలకు వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ వారి విజయనిరుద్ధం (పౌరాణిక పద్య నాటకం), ప్రారంభ సమావేశం 6గంటలకు ప్రారంభమవుతుందని సభాధ్యక్షుడిగా వనం లక్ష్మీకాంతరావు వ్యవహరిస్తారని తెలిపారు. ముఖ్యఅతిథిగా చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పందిళ్ల శేఖర్ బాబు స్మారక పురస్కారం జీవీ బాబు (రచయిత, దర్శకులు, నటులు) సన్మాన గ్రహీత వేముల ప్రభాకర్ లకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# చల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, సమైక్య పాలనలో పడ్డ గోసలు ఇప్పుడు లేవని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, ఆత్మకూర్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పూజారి రాము, బీజేపీకి చెందిన మాజీ వార్డు మెంబెర్ తోట సాంబయ్య, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ జనరంజక పాలన, సంక్షేమ కార్యక్రమాలు, పరకాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు చోటులేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మాజీ సర్పంచులు..

గీసుగొండ మండలం వంచనగిరి మాజీ సర్పంచ్ గుబల కవిత రమేష్, దామెర మండలం లాదెళ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదాసు వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఉప సర్పంచ్ మాదాసు కీర్తి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గారు గులాబీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణంలోని తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణా చారి శుక్రవారం అక్షర నేస్తం జర్నలిస్టుకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా పూర్ణా చారి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టు మిత్రుడు ములకనూరు సందీప్ అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా విషయం తెలియడంతో తన వంతుగా ఆర్థిక సాయం చేశానని తెలిపారు. కౌన్సిలర్ పూర్ణా చారి దయార్థ హృదయానికి జర్నలిస్టు మిత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**వరంగల్ వాయిస్, నడికూడ :** పీఆర్ టీయూ నడికూడ మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ ఆదేశానుసారంగా శుక్రవారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మండలంలోని ఉపాధ్యాయులు అందరూ పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో పట్టుకొని తమ నిరసన తెలియజేశారు. అనంతరం నడికూడ మండలం తహసీల్దార్ కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా మండల శాఖ ప్రధాన కార్యదర్శి అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాలు కలిగిస్తున్నందున, ఇఈ విధానాన్ని రద్దు పరుస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నడికూడ మండల శాఖ పక్షాన ప్రభుత్వానికి సవినయంగా మనవి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి అచ్చ సుదర్శన్, మండల శాఖ అసోసియేట్ అధ్యక్షుడు మామునూరు రాజన్న, ఉపాధ్యాయులు నాగుల జగదీష్, ఊనూరి కోటేశ్వర్, పోలంపల్లి విజేందర్, రుపావత్ ఝాన్సీ, కొర్ర కుమారస్వామి పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో మేరా మిట్టి మేరా దేశ్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** బీజేపీ ఆధ్వర్యంలో మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు జనపు రెడ్డి సురేందర్ రెడ్డి ప్రారంభించారు. కొత్తకొండలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రతి ఇంటి నుంచి పిడికెడు మన్ను సేకరించి ఢిల్లీకి పంపడానికి రాజకీయ పార్టీలకతీతంగా ఈ కార్యక్రమం చేయాలన్నారు. అన్ని రాష్ట్రాలు చేస్తున్న తెలంగాణలో మాత్రం ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోక పోవడం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు ఇదో నిదర్శనం అంటూ వాపోయారు. ఆజాది కా అమృత్యోత్సవంలో భాగంగా స్వతంత్ర పోరాటంలో అసువులు బాసిన మహనీయులను స్మరించుకుంటూ తలపెట్టిన పవిత్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాయకులు ఉసకోయిల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య మిత్రుడికి ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన ఎస్-ఎస్సీ ఎల్లంపేట జడ్పీఎస్ఎస్ 1997-98 బ్యాచ్ కు చెందిన బత్తెం శ్రీనివాస్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై కాలేయ సమస్యతో బాధపడుతున్న తనను తన క్లాస్ మేట్స్ సందర్శించి తనకు బాసటగా మేమున్నామని, అధైర్య పడవద్దనీ, వారి కుటుంబానికి ధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మెరుగైన ఆరోగ్యం కోసం వారి క్లాస్ మెట్స్ నుంచి సేకరించిన రూ.26వేలను శ్రీనివాస్ కు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులు 25ఏళ్ల తర్వాత మా కుటుంబాన్ని గుర్తు పెట్టుకొని మాకు ఈ సహాయాన్ని అందించిన మీకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కుదురుపాక గురుమూర్తి, భూక్య కృష్ణ, ఎర్రబెల్లి యాకయ్య, మాలోత్ భరత్, గుగులోతు హరి, నెలకుర్తి అశోక్, ఉర్లుగొండ మహేష్, మేక అశోక్ పాల్గొన్నారు. శ్రీనివాస్ కు చేయూతనందించిన వారిలో వారి గురువులు మోహనరావు, వాసుదేవ రెడ్డి, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్, వారి క్లాస్ మేట్స్ గర్రెపల్లి కృష్ణ కిషోర్, డీ.ఎస్ జ్యోతి, డి మానస, ఏ గీతాంజలి, జి.ఉప్పలయ్య, ఎండీ యాస్మిన్, టి.సుప్రియ, ఏ.కిషన్, బి గోపాల్, షహనాజ్, భాగ్యలక్ష్మి, శోభారాణి, కే.మధు మల్సూర్, యుగేందర్, ఎస్ వీరన్న, ఏ నరేష్ , బి.సోమయ్య, బి రఘు, ఆది యాకయ్య, బి.లక్ష్మి, బాలకిషన్, నాగులు, వి.సురేష్ , బి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

**వరంగల్ వాయిస్, మల్హార్ :** అక్టోబర్ 1 వరకు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని మండల తహశీల్దార్ వై.శ్రీనివాస్ కోరారు. రెండవ దశ ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 22 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని, కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు, ఓటరు జాబితాలో తప్పులు సరిదిద్దు కునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి జాటోత్ ఇందిర, పాలకుర్తి తెలుగు యువత నేత ఎడవెల్లి సన్నీ, ఆకుల శ్రీనివాస్, గుగులోతు నరేశ్, కుర్వ శివ, ఎడవెల్లి నవీన్, పల్లేర్ల వెంకటేశ్, కుర్ర దేవి తదితరులు హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో శుక్రవారం చేరారు. అలాగే పాలకుర్తికి చెందిన కాంగ్రెస్ పార్టీ సిరిపాటి ఎల్లస్వామి, సిరిపాటి మహేశ్ లు పాలకుర్తి ఉప సర్పంచ్ తరాల చంద్రబాబు, వార్డు సభ్యుడు వీరమనేని హన్మంతరావుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరారు. వారందరికి మంత్రి ఎర్రబెల్లి గులాబీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం కేసీఆర్, పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. మంత్రి ఎర్రబెల్లి నాయకత్వంలో తమ గ్రామ అభివృద్ధికి తాము పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరిన వారికి తగిన రీతిలో సముచిత గౌరవ మర్యాదలు ఉంటాయని చెప్పారు. వాళ్లంతా గ్రామ అభివృద్ధికి పాటుపడాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

## పద్మశాలి శంఖారావం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ఈనెల 3న హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో జరగబోవు పద్మశాలి శంఖారావం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో జరిగింది. ఈ శంఖారావం మహాసభకు ధర్మసాగర్ మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల బాంధవులు శ్రీరాముల విజయ్ కుమార్, గడ్డం రమేష్, గాజుల వెంకటేశ్వర్లు, ఈనుగుల మల్లేశం, గుర్రపు లక్ష్మి నారాయణ, పూల శ్రీనివాస్, గడ్డం నరసయ్య, గడ్డం వేణు కుమార్, గుర్రపు రాజేష్, ఆడెపు శివ, శ్రీరాముల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పంపిణీలో ఎమ్మెల్యే జోక్యం ఎందుకు ..?

### జీఎంపీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** గొర్రెల పంపిణీ చేయడంలో ఎమ్మెల్యేల జోక్యం ఎందుకని, అవినీతిని ప్రోత్సహించడానికేనా చెప్పాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ కోసం గ్రామాలలో తీసిన డ్రాలకు విరుద్ధంగా ఎమ్మెల్యేలు తమ పార్టీ నాయకులకు సీరియల్ ప్రకారం కాకుండా ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని పేర్లు రాసి పంపిస్తున్నారని, వీరికి ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, ఈ విధానం వలన గ్రామాలలో ఐక్యత ఉన్న కులాన్ని దెబ్బతీసి, అల్లర్లు సూచించడం కోసం, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారని దీన్నివెంటనే ఎమ్మెల్యేలు ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు. పద్ధతి మార్చుకోకపోతే రానున్న ఎన్నికలలో గొల్ల కురుమల అగ్రహానికి ఎమ్మెల్యేలకు తప్పదని హెచ్చరించారు. గొర్ల కాపరుల కుటుంబాలకు గొర్రెలకు బదులు నగదు బదిలీ చేస్తే ఎలాంటి అవకతవకలు జరగవని, అనేక సందర్భాల్లో ఆందోళన, పోరాటాలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడమంటే మధ్య దళారులను, అవినీతిపరులను ప్రోత్సహించడమేనని తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునర్ ఆలోచించి నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

## పశ్చిమలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీలకే టికెట్ ఇవ్వాలి

### కాంగ్రెస్ మాజీ నగర అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ నాయకులకే టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ మాజీ నగర అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత చరిత్రలో ఎన్నడు కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి పశ్చిమ నియోజకవర్గంలో బీసీలకు టికెట్ ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ నుంచి పశ్చిమలో టికెట్ ఇస్తే వంద శాతం జెండా ఎగురవేసే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్నీ రాష్ట్ర నాయకులు, హై కమాండ్ గుర్తించాలని అన్నారు. గత నాలుగు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ గెలవడానికి కారణం బీసీ బిడ్డ కాబట్టె తన గెలుపుని విజయవంతం చేసుకుంటున్నారని అన్నారు. కాబట్టి కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకసారి ఛాన్స్ బీసీ బిడ్డకు టికెట్ ఇవ్వాలని కోరారు. రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, డీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు పార్లమెంట్ లో కూడా బీసీలకు టికెట్ ఇవ్వాలనే కాంగ్రెస్ పార్టీ తీసుకున్నదని తెలిపారు. కాబట్టి అదే ఆలోచన తో పశ్చిమలో బీసీ బిడ్డకు టికెట్ ఇస్తే విద్యావంతులు, బీసీ సంఘాలు, మేధావులు, పశ్చిమ నుంచి కాంగ్రెస్ పార్టీ లో ఉన్నారని, అలాగే దళిత సంఘాలు, మైనారిటీ సోదరులు అంత కూడా కాంగ్రెస్ పార్టీ కి మద్ధతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే మేము అందరం కూడా బీసీ బిడ్డకు టికెట్ ఇస్తే మద్దత్తు గా ఉంటామని కావున కాంగ్రెస్ పార్టీ దీనిని గుర్చించాలని అన్నారు.బీసీ బిడ్డకు టికెట్ ఇవ్వాలని ఇది ఒక మాకు లక్ష్యమని హై కమాండ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు అలోచించి పశ్చిమలో బీసీ లకే టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొడిపాక గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ రేపల్లె శ్రీనాథ్, ఓబీసీ స్టేట్ కో ఆర్డినేటర్ సందుపట్ల ధన్ రాజ్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్, 08వ డివిజన్ మాజీ అధ్యక్షుడు సీత శ్యాంసుందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వై.భాస్కర్ పాల్గొన్నారు.

## తపాలా శాఖ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తపాలా శాఖ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహణకు నిర్ణయించారని "డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా" అంశంపై పోటీలు జరగనున్నాయని తపాల శాఖ సహాయ పర్యవేక్షకుడు లావుడ్య సైదా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రెండు కేటగిరీల్లో పోటీలను నిర్వహించనుండగా 18సంవత్సరాల వయసు లోపు వారు ఒక కేటగిరీ, 18 సంవత్సరాల వయసు పైబడిన వారిని మరో కేటగిరీగా నిర్ధారించారు. పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు ఏ-4 సైజు పేపర్ లో వెయ్యి పదాలతో వ్యాసం రాసి పంపించాలని లేదా ఇన్లాండ్ లెటర్లో 500పదాల్లో రాసి పంపించొచ్చు. అక్టోబర్ 31లోగా చేరేలా 'ది చీఫ్ పోస్ట్మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 చిరునామాకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో రాసి పోస్ట్ బాక్స్ లో వేయాలని లేదంటే నేరుగా పోస్టాఫీసుల్లో తీసుకుంటారన్నారు. అక్టోబర్ 31 తర్వాత వచ్చిన వాటిని పరిగణనలోకి తీసుకోమని పేర్కొన్నారు. తెలంగాణ పోస్టల్ సర్కిల్, జాతీయ స్థాయిలో బహుమతులు పోటీల్లో విజేతలకు కేటగిరీల వారీగా నగదు బహుమతులు అందజేస్తారని తెలంగాణ పోస్టల్ సర్కిల్ స్థాయిలో వరుసగా మొదటి, రెండో, తృతీయ బహుమతి కింద రూ.25వేలు, రూ.10వేలు, రూ.5 వేల రూపాయల చొప్పున ముగ్గురికి అందజేస్తారన్నారు. అలాగే తపాల శాఖ జాతీయ స్థాయిలో మొదటి, రెండో, తృతీయ బహుమతి కింద రూ.50వేలు, రూ.25వేలు, రూ.10 వేల రూపాయల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు."డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా" అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తుండగా విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, ఆర్థికం, సేవలు, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలను పొందుపర్చాలని సూచించారు. రెండు కేటగిరీల్లో జరిగే వ్యాసరచన పోటీల్లో మహబూబాబాద్ సబ్ డివిజన్ నుంచి ఎక్కువ మంది పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించగలరని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రాల సాంబ రెడ్డి, మండల కోశాధికారి తలగంప రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోడెపాక ప్రశాంత్, సీనియర్ నాయకులు నాగుర్ల శ్రీను, బుర్ర సురేందర్, ముంజ విజేందర్, కోడెపాక రగయ్య, బుర్ర రఘు, తంగేళ్ల ప్రీతం రెడ్డి, ఆవుల రవికుమార్, బుర్ర లక్కీ, సముద్రాల రాజు, కొడపాక స్వామి, రాజేందర్, వరుణ్, శివ, ఐలయ్య, సదయ్య, వివిధ గ్రామాల కాంగ్రెస్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తొర్రూర్ లో బీజేపీ ఆధ్వర్యంలో మేరా మిట్టి-మేరా దేశ్ కార్యక్రమం స్థానిక పాటిమీద హనుమాన్ దేవాలయం వద్ద ప్రారంభం చేసి పవిత్ర మట్టి సేకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య మాట్లాడుతూ ప్రధాని మోడీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రతీ గ్రామం,పట్టణం లో పవిత్ర స్థలం నుంచి గానీ, అమరవీరుల ఇంటి నుంచి గానీ మట్టి సేకరించి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధుల స్మారకంగా నిర్మిస్తున్న అమృత వనంలో భాగస్వామ్యం చేయడం జరుగుతుందని తెలిపారు. ఆనాటి పోరాట యోధుల వీరత్వాన్ని, పోరాట స్ఫూర్తిని, దేశ భక్తిని నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భారతమాత విముక్తి పోరాటంలో ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బలిదానం చేస్తే నేటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మనకు దక్కిందన్నారు. నాటి అమరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాంమోహన్ రెడ్డి, ఎస్సీ మోర్చా మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జి అలిసేరి రవిబాబు, జిల్లా నాయకులు మంగళపల్లి యాకయ్య, బొమ్మనబోయిన కుమార్, రాయపురం రాజుకుమార్, సీహెచ్ విజయ్ కుమార్, గంధం రాజు, నూకల నవీన్, పప్పుశెట్టి సంతోష్, క్రాంతి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# మౌనం వీడి షీటీమ్‌కు ఫిర్యాదు చేయండి

## వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రత్యక్షంగాని లేదా పరోక్షంగాని ఆకతాయిలతో లైంగిక వేధింపులకు గురవుతున్న అమ్మాయిలు, మహిళలు ఇకనైనా మౌనం వీడి నిర్భయంగా షీ టీమ్ కు ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ మహిళలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ ఉమెన్ సేఫ్టీ విభాగం అధ్వర్యంలో పనిచేస్తున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ యువతులు, మహిళల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, ముఖ్యంగా ఆన్ లైన్ లో ఎక్కడైనా ఎప్పుడైనా అమ్మాయిలు, మహిళలను వేధించే ఆకతాయిల పట్ల వరంగల్ షీ టీమ్స్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తునే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. షీ టీమ్స్ పనితీరుపై మహిళలకు మరింత నమ్మకం పెరగడంతో ఆకతాయిలపై మహిళలు, యువతులు చేస్తున్న ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ సంవత్సరంలో జనవరి మాసం నుంచి ఆగస్టు 31 వరకు 208 ఫిర్యాదులు అందగా, విచారణ అనంతరం 21మంది పోకిరీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి 134మందిని అరెస్టు చేయగా, 105 మందిపై కేసులు నమోదు కాగా, 82మందికి షీ టీం కార్యాలయములో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. గడిచిన ఆగస్టు మాసంలో 25 ఫిర్యాదులు రాగా, ఇద్దరుపై క్రిమినల్ కేసులు, 15 మంది పీట్టీ కేసులు మరో 8మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. షీ టీమ్స్ పై మరింత అవగాహన కల్పించేందుకుగాను రైల్వే స్టేషన్, బస్టాండ్, ఆలయాలు, పబ్లిక్ గార్డెన్స్, పాఠాశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్ వద్ద షీ టీమ్స్ అధ్వర్యంలో మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. ఈ సంవత్సవం ఇప్పటి వరకు 134పైగా అవగాహన సదస్సులు ఎర్పాటు చేయబడ్డాయి. అలాగే ప్రత్యేక పోస్టర్లు, బ్యానర్లను కూడా రూపోందించడం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, అమ్మాయిల భద్రత కోసం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో షీ టీం బృందాలు పనిచేస్తున్నాయని, ఇన్ స్పెక్టర్ నేతృత్వంలో ఒక మహిళతో సహ ముగ్గురు ఎస్ఐలు, ఒక ఏఎస్ఐ, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 5కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఒక మహిళా హెూంగార్డు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా ప్రత్యక్షంగాని, పరోక్షంగాని లేక సామాజిక మాధ్యమాల ద్వారా గానీ మహిళలు, యువతులు లైంగిక వేధింపులకు గురైతే తక్షణమే షీ టీమ్స్ నంబర్లు 8712685142, 8712685270 లేదా డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కిట్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా బండారు సుమంత్ కుమార్, సుకన్య, రోబోటిక్స్ శిక్షకురాలు, డా.బండారు సుమంత్ కుమార్ మిత్ర బృందం శుక్రవారం ఏవీవీ పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువ చేసే స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యార్థులకు దాతృత్వాన్ని అందించే భాగ్యాన్ని కల్పించినందుకు ఏవీవీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏవీవీ విద్యా సంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డా.చందా విజయకుమార్ మాట్లాడుతూ నేటి దాత డా.సుమంత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏవీవీ విద్యా సంస్థల శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్, ప్రిన్సిపల్ డా ఏ భుజేందర్ రెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎన్.నవీన్, యం.వాసంతి, జి. భాగ్యలక్ష్మి, జి.వీరేశలింగం, వి.రమాదేవి, జి.సుధారాణి, ఫిలిప్ లాజరస్, చిలుక భాస్కర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

## వైద్యారోగ్య శాఖ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్య ఆరోగ్య సంఘాల ఐక్యవేదిక వరంగల్ ఉమ్మడి జిల్లా సమావేశం శుక్రవారం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆర్.ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐక్యవేదిక సెంట్రల్ కోర్ కమిటీ నాయకులు బానోతు నెహ్రూ చంద్ నాయక్, బత్తిని సుదర్శన్ గౌడ్ హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సందర్భాలలో స్వయంగా ఇచ్చిన మాట ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో గత 20ఏళ్లకు పైబడి పని చేస్తున్న కాంట్రాక్టు, (రెండో ఏఎన్ఎంలు, యూరోపియన్ ఏఎన్ఎంలు, ఫార్మసిస్ట్ లు, ల్యాబ్ టెక్నీసియన్లు, ఎన్ హెచ్ఎంలలో పని చేస్తున్న అన్ని క్యాడర్స్ ఉద్యోగులు ) ఔట్ సోర్సింగ్ అన్ని కేడర్స్ ఉద్యోగులను సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అలాగే హెల్త్ ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు గుగులోత్ వీరేందర్, కె.విద్యా సాగర్, హనుము నాయక్, కె.సంపత్, డి.రవీందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) స్కీం లో పనిచేస్తున్న కాంట్రాక్టు అల్ క్యాడర్స్ ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యూలర్ చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నరపు రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏకశిలా పార్క్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యూలర్ చేస్తానని చెప్పి తొమ్మిది సంవత్సరాలు కాలం పూర్తవుతున్నా ఒక్క ఉద్యోగిని కూడా పెర్మినెంట్ చేయలేదని ఆరోపించారు. సుమారుగా 15,000 మంది ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పది లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ చెన్నకేశవలు, హనుమకొండ జిల్లా ప్రెసిడెంట్ విష్ణు మూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీబాద్రి వేణు, జి.సరిత, సుజాత, మంజుల, ప్రవీణ్, జ్యోతి, వేంకేటేశ్వరలు, ఉష ప్రియా, ఏకుల చిరంజీవి, ప్రభాకర్, మాధవ్ రావు, క్రాంతి, విజయ్ నాయక్, వరుణా, దిలీప్ కుమార్, వి.రాజేష్, రాకేష్, సాగర్, సతీష్ కుమార్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## కేసీఆర్, ఎర్రబెల్లి చిత్రపటాలకు పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండల జాతీయ రహదారి ప్రధాన చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్రపటాలకు మహిళ సంఘాల సీఏలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల సీఏలు, ఎడ్ల సులోచన, జక్కుల గంగరాజు మాట్లడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాకే మమ్మల్ని గుర్తించి జీతాలు పెంచారన్నారు. రక్షాబంధన్ కానుకగా మహిళ సంఘాల సహాయ సీఏలకు రూ.5000 నుంచి 8000 పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా మహిళ సంఘాల తరుపున ప్రతేక ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట్ రెడ్డి, సీసీ సదానందం, సోమనాథం, సరళ, ప్రేమలత, ఉమాదేవి, సావిత్రి, శారద, సీత మల్లేష్ మహిళ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## మహా బూత్ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండలంలోని ఇల్లంద గ్రామంలో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మట్టికి నివాళులు -వీరులకు వందనాలు (మేరా మిట్టి-మేరా దేశ్ ) కార్యక్రమం నియోజకవర్గ కోకన్వీనర్ రాయపురపు కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట మాజీ శాసన సభ్యుడు, బీజేపీ వరంగల్ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హాజరై మాట్లాడుతూ ఇది బీజేపీ కార్యక్రమం కాదని, భారత ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమమని తెలిపారు. కాబట్టి పార్టీలకతీతంగా యువతను, మహిళలను, విద్యావేత్తలను, సామాజిక కార్యకర్తలను కలుపుకొని జిల్లా, మండల, గ్రామ ముఖ్యనేతలతో ప్రతి మండలంలో కనీసం ఒక గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 1న ఘనంగా ప్రారంభించాలని తెలియజేశారు. సెప్టెంబర్ 2 నుంచి 15 వరకు అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ పతాకాలు, కండువాలు, నినాదాలు ఈ కార్యక్రమంలో వాడకుండా జాతీయ పతాకాన్ని చేతబూని కార్యక్రమం నిర్వహించి దేశ భక్తి నినాదాలతో ముందుకు సాగాలని తెలిపారు. మట్టి సేకరణ పూర్తి అయిన తరువాత అమృత కలశాన్ని మండల కేంద్రానికి తరలించేంత వరకు ఒక పవిత్ర స్థలంలో భద్ర పరచాలని, ప్రతి మండలానికి ఒక కలశ్ ప్రముఖ్ ను నియమించాలని సూచించారు.
అనంతరం ఈ నెలలో జరిగే మహా బూత్ సమ్మేళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు తరలి వచ్చేలా ప్రణాళిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి యకయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి పిట్టల రాజు, జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ కుందూరు మహేందర్ రెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇంచార్జిలు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.


## పౌరులు ఓటు నమోదు చేసుకోవాలి

**వరంగల్ వాయిస్, మరిపెడ :**మండలంలో అక్టోబర్ 1, 2023 నాటికి 18ఏళ్లు నిండిన పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని మరిపెడ తహసీల్దార్ సైదులు ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, ప్రత్యేక క్యాంప్ నిర్వహించే సమయంలో సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాతో అందుబాటులో ఉంటారని, అక్టోబర్ 1,2023 నాటికి 18సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు ప్రత్యేక క్యాంపులను వినియోగిస్తూ తమ పేర్లు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రకటనలో కోరారు.

# డిఫరెంట్ లవ్ స్టోరీ ఖుషీ

## నటనతో మెప్పించిన విజయ్, సమంత

'ఖుషి'తో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలనే తపనతో అగ్ర హీరో విజయ్ దేవరకొండ పట్టుదలగా ఉన్నాడు. మ్యూజికల్ లవ్‌స్టోరీలో విజయ్ దేవరకొండతో సమంత జోడీ కట్టడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. ఈ సినిమా పాటలు అన్ని భాషల్లో పాపులర్ కావడం, ట్రైలర్ కూడా ఆకట్టుకోవడంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. బీఎస్ఎన్ఎల్ సంస్థలో ఉద్యోగం సంపాదించిన విప్లవ్ (విజయ్ దేవరకొండ) తన పోస్టింగ్‌ను కశ్మీర్‌లో ఇవ్వాలని కోరతాడు. కశ్మీర్ అంటే మణిరత్నం సినిమాల్లో చూపించే అందమైన మంచుపర్వతాలు, వాటికి తోడుగా ఏ.ఆర్.రెహమాన్ మ్యూజిక్, అందమైన రొమాన్స్ అలా ఓ ఫాంటసీ ప్రపంచాన్ని ఊహించుకుంటాడు. అయితే అక్కడకు వెళ్లగానే ఓ బాంబ్‌బ్లాస్ట్ ఇన్సిడెంట్, భద్రతా దళాలు, తీవ్రవాదుల మధ్య కాల్పుల సంఘటనను ఫేస్ చేయడంతో భయానికి గురవుతాడు. కశ్మీర్‌లో జీవితం ఊహించినట్లుగా అంత అందంగా ఉండదని అర్థమవుతుంది. ఈ సందిగ్ధ పరిస్థితుల్లో అక్కడ ఆరాబేగం (సమంత) పరిచయమవుతుంది. తొలిచూపు లోనే ఆమె ప్రేమలో పడతాడు విప్లవ్. తప్పిపోయిన తన సోదరుడి కోసం తాను పాకిస్థాన్ నుంచి వచ్చానని విప్లవ్‌కు అబద్ధం చెబుతుంది ఆరాబేగం. ఈ క్రమంలో వారు ప్రేమలో పడతారు. కొద్ది రోజుల తర్వాత ఆరాబేగం అసలు పేరు ఆరాధ్య అని, ఆమె కాకినాడకు చెందిన అమ్మాయి అని విప్లవ్‌కు తెలుస్తుంది. తాను ప్రముఖ ప్రవచనకర్త చదరంగం శ్రీనివాస రావు (మురళీశర్మ) కుమార్తెనని విప్లవ్‌తో చెబుతుంది ఆరాధ్య. మరోవైపు విప్లవ్ తండ్రి లెనిన్ సత్యం హైదరాబాద్‌లో నాస్తికవాద సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తుంటాడు. గతంలోనే చదరంగం శ్రీనివాసరావుకు, లెనిన్ సత్యం మధ్య సిద్ధాంత పరమైన విభేదాలుంటాయి. ఈ నేపథ్యంలో తన కుటుంబ అభీష్టానికి వ్యతిరేకంగా ఆరాధ్య.. విప్లవ్‌ను పెళ్లాడుతుంది. ఇద్దరి జాతకం కుదరనందున వివాహంలో సమస్యలు వస్తాయని ఆరాధ్య తండ్రి చదరంగం శ్రీనివాస రావు హెచ్చరిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఈ జంట వైవాహిక జీవితంలో ఎలాంటి మలుపులు తిరిగిందన్నది సినిమా కథ. సనాతన ధర్మాన్ని ఆచరించే అమ్మాయి కుటుంబం, నాస్తిక వాదాన్ని నమ్మే అబ్బాయి తండ్రి..వీరిద్దరి మధ్య జరిగే ఓ సంఘర్షణ



నేపథ్యంలో దర్శకుడు శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. జంట మధ్య వివాహానంతరం ఏర్పడే విభేదాలు, మనస్పర్థల నేపథ్యంలో గతంలో ఎన్నో ప్రేమకథా చిత్రాలొచ్చాయి. అయితే ఈ సినిమాలో సనాతన ధర్మం, నాస్తికత్వం అనే విరుద్ధ సిద్ధాంతాల నడుమ ఓ జంట ప్రయాణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశాడు. సున్నితమైన అంశాన్ని తీసుకొని అంతిమంగా బంధాలు, ప్రేమలు గొప్పవనే సందేశాన్ని అందించారు. కశ్మీర్ నేపథ్యంలో ఈ సినిమా ప్రథమార్థం ఆద్యంతం ఆహ్లాదభరితంగా, చక్కటి వినోదంతో సాగింది. చిన్న అబద్ధంతో మొదలైన విప్లవ్, ఆరాధ్య ప్రేమాయణాన్ని తెరపై అందంగా ఆవిష్కరించారు. ఆరాబేగం అలియాస్ ఆరాధ్య ప్రేమను గెలుచుకోవడానికి విప్లవ్ చేసే ప్రయత్నాలు, ఈ క్రమంలో వచ్చే సన్నివేశాలు హృద్యంగా ఉంటూ మంచి వినోదాన్ని పంచుతాయి. విజయ్ దేవరకొండ, వెన్నెల కిషోర్ మధ్య కామెడీ బాగా వర్కవుట్ అయింది.


ఇక సెకండాఫ్‌లో ఫ్యామిలీ ఎమోషన్స్‌పై కథ నడుస్తుంది. ఆరాధ్యకు సంతానం కలగాలంటే హోమం జరపాల్సిందేనని చదరంగం శ్రీనివాసరావు పట్టుబడటం, దానికి లెనిన్ సత్యం వ్యతిరేకించడంతో రెండు కుటుంబాల మధ్య సంఘర్షణతో ద్వితీయార్థం భావోద్వేగాలతో నడుస్తుంది. అయితే హోమం నేపథ్యంలో సాగే డ్రామాను సాగతీశారనే భావన కలుగుతుంది. శాస్త్రాలు, సైన్స్ కంటే ప్రేమ, పెళ్లి బంధమే గొప్పదని ఇరు కుటుంబాలు రియలైజ్ కావడంతో కథ సుఖాంతమవుతుంది.



## మరో మహిళా ప్రాధాన్య పాత్రలో ..

మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచారు అనుష్కశెట్టి. 'అరుంధతి', రుద్రమదేవి, 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్రలతో మెప్పించిన ఆమె ఆ తరహాలోనే మరో పాత్ర చేయనున్నారు. ఇప్పటి వరకూ తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలకే పరిమితమైన అనుష్క ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి మలయళ ఇండస్ట్రీలో కూడా అడుగు పెడుతున్నారు. 'కథనార్- ది వైల్డ్ సోర్సరర్' టైటిల్‌తో రానున్న చిత్రంలో కీలక పాత్ర చేయడానికి అనుష్క గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జయసూర్య హీరోగా నటించబోతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనుంది. కేరళలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఇందులో అనుష్క పాత్ర 'అరుంధతి' తరహాలో ఉంటుందని సమాచారం. రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. 14 భాషల్లో ఏకకాలంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మొదటి భాగాన్ని 2024లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ పేర్కొన్నారు. శుక్రవారం హీరో జయసూర్య పుట్టినరోజుసందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ప్రస్తుతం ఈ గ్లింప్స్ సందడి చేస్తోంది. అనుష్క తొలిసారి మలయాళ చిత్రంలో అదీ మహిళా ప్రాధానం ఉన్న కథ కావడం హాట్ టాపిక్‌గా మారింది.తాజాగా అనుష్క తెలుగులో నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నెల 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.





## ఒకే సారి నాలుగు..

రీసెంట్‌గా గాంఢీవదారి అర్జున సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ . ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం వార్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఆపరేషన్ వాలెంటైన్ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి శక్తి ప్రతాప్ సింగ్ హడ దర్శకత్వం వహిస్తుండగా.. ఈ ప్రాజెక్టుతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. డిసెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా కరుణకుమార్ దర్శకత్వంలో నటిస్తోన్న తొలి పాన్ ఇండియా సినిమా కోసం మేకోవర్ మార్చుకునే పనిలో పడ్డాడు వరుణ్ తేజ్. మట్కా టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రంలో తన పాత్రకు తగ్గట్టుగా బాడీ లాంగ్వేజ్‌ను మార్చుకునే పనిలో బిజీగా ఉన్నాడు. వరుణ్ తేజ్ జిమ్‌లో చెమటోడుస్తూ.. సెల్ఫీ తీసుకుంటున్న స్టిల్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.కథానుగుణంగా ఇందులో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరాఫతేహి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో మాజీ మిస్ యూనివర్స్ మానుషి ఛిల్లార్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.

## ఫన్నీ కామెడీ పండిస్తున్న అనుదీప్

పిట్టగోడ అనే ఫ్లాప్ మూవీతో దర్శకుడిగా ఇండస్ట్రీక్రి పరిచయమైన అనుదీప్ .. ఆ తర్వాత 'జాతిరత్నాలు' సినిమాతో ఓవర్ నైట్ క్రేజీ డైరెక్టర్ గా మారిపోయారు. ఒక్క సారిగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యారు. ఇదే జోష్ లో కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్ తో 'ప్రిన్స్' అనే ద్విభాషా చిత్రం చేయగా అది బోల్తా కొట్టింది. అయితే దర్శకుడిగా ఆయన తనలోని మరో కొత్త కోణాన్ని బయటపెట్టేందుకు రెడీ అయిపోయారు. నటుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తన ఫన్నీ కామెడీ మాటలతో, ఇనోసెంట్ ఎక్స్ ప్రెషన్ తో పాపులర్ అయ్యారు అనుదీప్. ముఖ్యంగా ఇంటర్వ్యూల సమయంలో యాంకర్ల ముఖాల్లో ఓ క్వశ్చన్ మార్క్ రెయిజ్ చేయడం, షార్ట్ ఆన్సర్స్ చెప్పడం.. ఇలా రకారకాలుగా సోషల్ మీడియాలో బాగా హైలైట్ అయ్యారు. మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే ఇప్పుడాయన నటుడిగా మారారు. ఎన్టీఆర్ బావమరిది నటిస్తున్న నార్నె నితిన్ కొత్త సినిమా మ్యాడ్ లో ఓ పాత్ర పోషించారు. కాలేజ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్ర టీజర్ తాజాగా రిలీజై ఆకట్టుకుంది. ఇందులో అనుదీప్ కాలేజు కుర్రాళ్లతో పాటు కనిపించి ఆకట్టుకున్నారు. అనుదీప్ కామెడీ టైమింగ్ ఓ రేంజ్ లో ఉన్నట్టు అర్థమవుతోంది. అనుదీప్ తన మార్క్ కామెడీతో బాగానే నటించారని అనిపిస్తోంది.



# గడపగడపకి సంక్షేమ పథకాలు

## ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గడపగడపకి సంక్షేమ పథకాలు..గడప ముందు అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించిన ఘనత బీఆర్ ఎస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 11, 29 వ డివిజన్లలోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ తో పాటు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ 2009లో శాసనసభ్యుడిగా గెలిపించిన పార్టీ టీఆర్ఎస్ అని, టికెట్ ఇచ్చింది కేసీఆర్ అని గుర్తు చేశారు. కేసీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల ఆశయాలకు అనుకూలంగా పనిచేశానన్నారు. 2009 కంటే ముందు కార్పొరేటర్ గా ఉన్నప్పుడు నా డివిజన్ కు రూ.50 వేలు, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.5 లక్షలు కూడా తీసుకురానటువంటి పరిస్థితి అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్కో డివిజన్ కు రూ.50 కోట్ల నిధులతో అన్ని రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. మేము ఎవరినీ విస్మరించలేదన్నారు. భద్రకాళి చెరువుకు మత్తడి పడితే సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం సాగించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. కేంద్రం నుంచి పైసా తీసుకురానటువంటి వారు ఇక్కడ అనేక అకృత్యాలకు పాల్పడుతున్నారని.. నా సహనాన్ని పరీక్షించవద్దంటూ హెచ్చరించారు. 11, 29వ డివిజన్లలో రూ.61.48 కోట్ల పనులు జరిగాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సైతం పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు రూ.250 కోట్ల అభివృద్ధి నిధులు ఇచ్చి పట్టణాన్ని ఆదుకున్నాడన్నారు. అనంతరం కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు రుణ విముక్తి కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మేయర్ గుండు సుధారాణి, నగర మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా షేక్, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేయాలి

## ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో నిరసన




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో నిరసన తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ వైద్యులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల సూపరింటెండెంట్ కె.జగన్‌మోహనాచారి మాట్లాడుతూ సీపీఎస్ విధానం అనేది రాష్ట్ర పరిధిలోని అంశమని, రద్దు చేయాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికే పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఆదర్శంగా తీసుకొని ఇక్కడ కూడా ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మైదం రాజు, కె.వసంత, ఉష, ప్రవీణ్, ఈశ్వర్, శిరీష, శ్రీలత పాల్గొన్నారు.

# ఖిలా వరంగల్‌లో మడెలయ్య బోనాలు

## హాజరైన తూర్పు ఎమ్మెల్యే నరేందర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రజకుల ఆరాధ్య దేవుడు మడెలయ్య బోనం, పండగ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేకపోతులు, గొర్రె పొటేళ్లు, బోనాలు, డప్పుచప్పుల్లు, డీజే సౌండ్స్ తో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై రజక కులస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మడెలయ్యకు కొబ్బరి కాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రజకులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మడెలయ్య ఆశీర్వాదం అందరిపైన ఉండాలని కోరారు. అలాగే నగరంలో సుమారు రూ.2కోట్ల ప్రత్యేక నిధులతో మూడు కేంద్రాల్లో మాడ్రన్ దోభి ఘాట్స్ నిర్మిస్తున్నామని అందులో ఒకటి ఖిలా వరంగల్ గుండు చేరువు ప్రాంతంలో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే రజక కమ్యూనిటీ హాల్, రజక శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం రజకులకు 250 యూనిట్స్ ఉచిత కరెంట్, బీసీ బందులో రజకులకు అగ్రభాగాన అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రజక కుల పెద్దలు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, భైరబోయిన ఉమా దామోదర్, రాతిపెల్లి సాంబమూర్తి అధ్యక్షులు, కుల పెద్దలు గట్టికొప్పుల నర్సయ్య, గట్టికొప్పుల భిక్షపతి, రాతిపెలి రాజకుమార్, పెద్ద రమేష్, వెంకటేష్, శ్రీధర్, రాజు, చిన్న రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానంలో మనమే టాప్

## సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రవణ్ కుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అవయవ దానంలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ అన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండలోని విష్ణుప్రియ గార్డెన్స్ లో యోగా అభ్యసం చేస్తున్న వారికి నేత్ర, అవయవ, శరీర దానాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎందరో మానవతా మూర్తులు, స్వచ్ఛంద సంస్థలు, అవయవ దాన ఉద్యమంలో విశేష కృషి ఫలితంగానే దాతలు అత్యధికంగా అవయవ దానం చేసేందుకు ముందుకొచ్చారన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసి కార్నియల్ అంధత్వ రహిత తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారంతా సానుకూలంగా స్పందించారు. పీఎంసీ ప్రతినిధి రవీందర్ మాట్లాడుతూ మనం ఉన్నంత సేపు ద్యానం చేసి ఆరోగ్యవంతులుగా జీవించాలని, మరణానంతరం ఉపయోగపడే శరీర భాగాలను దానం చేసి మానవ జన్మకు సార్థకత చేకూర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్ గురూజీ, అజిత్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గ ఆలయంలో కుంకుమపూజ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 32వ డివిజన్ పరిధిలోని శ్రీ దుర్గ మల్లేశ్వర దేవాలయంలో శుక్రవారం కనుకదుర్గ అమ్మవారికి ఘనంగా కుంకుమ పూజ నిర్వహించారు. శ్రావణమాసం మూడోవ శుక్రవారాన్ని పురస్కరించుకొని డివిజన్ లోని శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన కనుకదుర్గ అమ్మవారి కుంకుమ పూజలో వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, 33 డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణతోపాటు తూర్పు ఎమ్మెల్యే సతీమణి వాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నాగపురి కల్పన, మేడిది రజిత, డివిజన్ ముఖ్య నాయకులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్ వాడీ ఉద్యోగుల సమ్మె సైరన్

## 11 నుంచి నిరవధికంగా విధులు బహిష్కరణ

## వరంగల్ జాయింట్ కలెక్టర్ శ్రీ వాత్సవకు సమ్మె నోటీస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంగన్ వాడీ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 11 నుంచి నిరవధికంగా విధులు బహిష్కరిస్తామంటూ హెచ్చరిం చారు. ఈ మేరకు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపడంతో పాటు సీఐటీయూ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ వాత్సవ కు సమ్మె నోటీసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ ఉద్యోగుల వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.నిర్మలాదేవి, టి.రాజేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్ వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 11నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీ ఉద్యోగులు సమ్మె బాట పడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, అంగన్వాడి ఉద్యోగుల గౌరవ అధ్యక్షురాలు, బి.రుక్మిణి, కోశాధికారి వి.లక్ష్మి, ఎల్.వనిత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌దే అధికారం

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వి ప్రకటించారు. ఆత్మకూరు మండలం అగ్రం పహాడ్ గ్రామం జీఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గుడెప్పాడు జంక్షన్ వద్ద ఇనుగాల ఆధ్వర్యంలో రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వికి శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. అనంతరం వన దేవతలైన అగ్రంపహాడ్ సమ్మక్క–సారక్కలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండ్రు శోభరాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, దొమ్మటి సాంబయ్య పాల్గొన్నారు.



# రోడ్డును కమ్మేసిన పొగ

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండల కేంద్రం శివారులో శ్మశాన వాటిక సమీపంలో రోడ్డు పక్కన చెత్తకు నిప్పంటించడంతో రోడ్డంతా పొగ కమ్మేసింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శ్వాస పీల్చుకోవడం కూడా కష్టంగా మారింది. పల్లె ప్రగతి పేరిట పారిశుధ్య చర్యలు చేపడుతున్నా రోడ్ల పక్కన మాత్రం చెత్త దర్శనమిస్తోంది. పర్వతగిరి మండల కేంద్రానికి డంపింగ్ యార్డ్ లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది ప్రతీ రోజు చెత్తను తెచ్చి రోడ్ల పక్కన పడేస్తున్నారు. పర్వతగిరి నుంచి నెక్కొండ వెళ్లే రహదారిలో ఉన్న మూల మలుపు వద్ద రోడ్డు పక్కనే రోజు వారి చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోవడంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రి వేళల్లో హెూటళ్ల నిర్వాహకులు, వ్యాపారులు వ్యర్థాలను చెత్త సంచుల్లో తీసుకొచ్చి ఇక్కడే వదిలేస్తున్నారు. కుక్కలు, పందులు చెత్త కుప్పల్లో తిరగడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గుట్టలుగా చెత్త పేరుకుపోవడంతో అక్కడే దానిని కాల్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చెరువు, కాల్వ గట్లపైన, ప్రధాన రహదారుల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోకుండా శాశ్వత పరిష్కారం కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com